క్లుప్తంగా

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన నూతన ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతంలో డీఎస్సీలో ఎంపికైన రజక ఉపాధ్యాయులను తాలూకా రజక ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయుడు నాగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏపీ రజక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సి.సావిత్రి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెడుతున్న ప్రతి ఒక్కరు మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహరాజు, గోవిందప్ప, సాయిబాబా, విరుపాక్షి, మద్దిలేటి, హనుమంతు పాల్గొన్నారు.

కొత్త ఉద్యోగులకు అభినందనలు



కొత్తగా ఉద్యోగం సాధించిన వారితో మండల ఉద్యోగుల బృందం

కోసిగి: మండలంలో ఇటీవల కొత్తగా 35 మంది ఉపాధ్యాయులు, 16 మంది పోలీసులు, ఒకరు బ్యాంక్ ఉద్యోగం సాధించారు. ఆదివారం కోసిగి శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో కొత్తగా నియామకం పొందిన ఉద్యోగులకు కోసిగి మండల సీనియర్ ఉద్యోగ బృందం సభ్యులు మెమొంటో అందజేసి అభినందించారు. వెనుకబడిన జిల్లాలోనే మారుమూల ప్రాంతం నుంచి పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని నిరుద్యోగులు కష్టపడితే విజయం తప్పక వరిస్తుందని సూచించారు. ఇందులో మండలంలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



బోల్తా పడిన ఆటో

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రానికి కి.మీ.దూరంలో రెండు వాహనాలు ఢీకొనగా ఐదుగురు గాయపడ్డారు. మంత్రాలయం నుంచి పత్తి సంచుల కోసం వెళ్తున్న ట్రాలీ ఆటోను కర్ణాటక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఆటో బోల్తా పడగా.. కారు ముందు భాగం దెబ్బతింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ అజయ్‌తోపాటు కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. బెంగళూరులోని శ్రీనివాసపురం నుంచి కారులో రాఘవేంద్రస్వామి దర్శనార్థం బజారుస్వామి కుటుంబ సభ్యులు మంత్రాలయం వస్తుండగా ఘటన జరిగింది.

కార్మిక సమస్యలపై నిరాహార దీక్ష

ఆదోని రూరల్: రాయలసీమ స్పిన్నింగ్ మిల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27, 28, 29వ తేదీల్లో చేపట్టే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మిల్లు కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిల్లు మూతబడి 25 సంవత్సరాలు అవుతోందన్నారు. దాదాపుగా 150 మంది కార్మికులకు గ్రాట్యుటీ, పీఎఫ్, పెన్షన్ తదితర సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పార్థసారథికి విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, నారాయణ, మిల్లు కార్మికులు కుమార్, మల్లికార్జున, ఖాదర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు.. వాహనదారుల ఇక్కట్లు



ముగతి- నందవరం రహదారిపై గుంతలో ఇరుక్కుపోయిన లారీ

నందవరం : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని నాగలదిన్నె- కే పేట రోడ్డు, అలాగే నాగలదిన్నె – ఎమ్మిగనూరు ప్రధాన రహదారులలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు, లారీలు గుంతల్లో ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల మయంగా రోడ్డు మారడంతో ఆయా గ్రామాల మీదుగా రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తరుచుగా వాహనాలు మరమ్మతులకు గురవతున్నాయని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేయాలని కోరతున్నారు.

ధరలు ధాం.. ధాం !



టపాసుల విక్రయానికి ఏర్పాటు చేసిన స్టాల్స్



ఎమ్మిగనూరు స్టాళ్లలో బాణసంచా కొనుగోలు చేస్తున్న స్థానికులు

- భారీగా పెరిగిన టపాసుల ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజల జేబులు గుల్ల
- రూ.2వేలు పెడితే క్యారీబ్యాగ్ నిండని వైనం



మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఆదోని సెంట్రల్/ఆదోని అర్బన్/ ఎమ్మిగనూరు టౌన్: దీపావళి పండుగ వచ్చిందంటే పిల్లలు, యువకులు టపాసులను కాలుస్తూ ఉత్సాహంగా సంబరాలను జరుపుకుంటారు. అయితే గత ఏడాది కన్నా ఈ ఏడాది టపాసుల ధరలు 20 శాతం కన్నా అధికంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రెండు వేల రూపాయలు పెట్టి కొంటే క్యారిబ్యాగ్ కూడా నిండటం లేదని ప్రజలు వాపోతున్నారు.

20 నుంచి 30 శాతం పెరిగిన ధరలు

ఆదోని పురపాలక క్రీడా మైదానంలో శనివారం రాత్రి నుంచే వ్యాపారులు 12 టపాసుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి టపాసుల విక్రయాలు జోరందుకున్నాయి. అలాగే ఎమ్మిగనూరు పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో 11 బాణసంచా విక్రయ స్టాళ్లను వ్యాపారులు ఏర్పాటు చేశారు. కాగా, గత ఏడాది కన్నా ఈ ఏడాది టపాసుల ధరలను చూసి జనాలు ఆందోళనకు గురవుతున్నారు. ఎంత తక్కువ అనుకున్నా కనీసం రూ. రెండు వేలు, మూడు వేలకు తగ్గడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. బాణసంచా ధరలు ఈ ఏడాది 20 నుంచి 30 శాతం పెరగాయని పలువురు పేర్కొన్నారు.

ధరలు పెంచిన కంపెనీలు

రవాణా, కులీలు, పన్నులు, అద్దెలు తదితర ఖర్చులను చూసుకొని ధరలను నిర్ణయిస్తారు. కెమికల్స్ ధరలు పెరగడంతో కంపెనీలు ధరలు పెంచుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల జేబులు గుల్లవుతున్నాయి. భూచక్రాల, కాకరొత్తులు బాక్స్ ధర గత ఏడాది రూ. 60లు నుంచి రూ.80లు ఉంటే ఇప్పుడు రూ.110లకు చేరింది. ఇలా ప్రతి వస్తువుపైన 20శాతం మేర అధికంగా పెరగడంతో సామన్య, మధ్యతరగతి ప్రజలు ఇలా అయితే పండుగ చేసుకున్నట్లేనని ప్రజలు వాపోతున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి పిల్లలతో కలిసి పెద్దలు కొనుగోళ్లు చేసేందుకు రావడంతో స్టాళ్లు కిటకిటలాడాయి, ఏదేమైనా బాణసంచా ధరలను నియంత్రణ చేయాలని కోనుగోలుదారులు అధికారులను కోరుతున్నారు.



ఆదోనిలో టపాసుల విక్రయ స్టాల్

టపాసుల దుకాణాల తనిఖీ



దుకాణాలతో సౌకర్యాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ ఎంఎన్. భార్గవి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని టపాసుల విక్రయ దుకాణ దారులపై డీఎస్పీ ఎంఎన్. భార్గవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి పట్టణంలోని వీవర్స్‌కాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన టపాసు విక్రయ దుకాణాలు డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వహకులు నిబంధనలు పాటించారా లేదా అనేవి పరిశీలించారు. దుకాణాలు ముందుకు టెంట్స్ ఎందుకు వేసుకున్నారు, ఫైర్ సెఫ్టీ సిలిండర్స్ మార్పు చేసుకోవాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన దుకాణం లైసెన్సును రద్దు చేయించి, విక్రయాలను నిలుపుదల చేస్తానని హెచ్చరించారు. 11 టపాసుల విక్రయ దుకాణాల నిర్వహకులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డీఎస్పీతో పాటు టౌన్ ఎస్ఐ మధుసుధన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాళిబొట్టు, మెట్టెల అందజేత



నరసమ్మకు తాళిబొట్టు, కాలిమెట్టెలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బండిమెట్ట వార్డుకి చెందిన నరసమ్మ కుమార్తె ప్రవీణ వివాహానికి తనవంతుగా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బంగారు తాళిబొట్టు, వెండి మెట్లను ఆదివారం స్థానిక స్వగృహంలో అందించారు. అలాగే మండలంలోని దిబ్బనకల్ గ్రామానికి చెందిన గుజ్జుల అంజి వివాహానికై బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్ల వివాహానికి తమ ఇంటి నుంచి తాళిబొట్టు, కాలిమెట్టెలు అందించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతి ఏటా ఎంతోమంది పేద పిల్లల వివాహాలకు తాళిబొట్టు, కాలిమెట్టెలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మన్నరావు, పరిగెల నారాయణ పాల్గొన్నారు.

వికాసతరంగిణి చీఫ్ కో ఆర్డినేటర్‌గా శ్రీనాథ్‌గుప్తా



శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక సంస్థ వికాసతరంగిణి ఆదోని శాఖకు ముఖ్య సమన్వయకర్త (చీఫ్ కో ఆర్డినేటర్)గా వంకదారు శ్రీనాథ్‌గుప్తాను నియమిస్తున్నట్లు సంస్థ ముఖ్య సంచాలకులు, చిన్నజీయర్‌స్వామి వారి ముఖ్య శిష్యులు శ్రీ భవానీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రజ్ఞా వికాస్ సమన్వయకర్తంగా వంకదారు మమతాశ్రీ, ఆర్థిక సమన్వయకర్తగా యాతగిరి వెంకటేశ్వర్లు, ఆరోగ్య సమన్వయకర్తగా ప్రతాప్ ఈరన్నశెట్టి, యువ వికాస్ సమన్వయకర్తగా కుప్ప రాజేష్, పౌర సంబంధాల సమన్వయకర్తగా వై.ఎం.రాఘవేంద్ర, రత్నయ్యలను నియమించారు. వికాస తరంగిణి ద్వారా ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజున స్వర్ణామృత ప్రాసనం అనే అద్భుతమైన ఆయుర్వేద మందును భావ ఆయుర్వేద శాస్త్రీయ చికిత్స కేంద్రం ద్వారా చిన్నారులకు అందజేస్తున్నామని సంచాలకులు తెలిపారు.

పరామర్శ



కురువ జయరాముడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : మండలంలోని మాధవరం గ్రామ వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కురవ జయరాముడు కిడ్నీలో రాళ్లు ఉండటంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయనతోపాటు నాయకుడు దశరథరెడ్డి ఉన్నారు.

స్నేహితుడికి అండగా..



స్నేహితుడికి నగదును అందజేస్తున్న 2004 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

గోనెగండ్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ మిత్రుడు మిమిక్రి ఆర్టిస్ట్ దాసరి ఓంకార్‌కు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని అయ్యకొండ గ్రామానికి చెందిన దాసరి ఓంకార్ కొద్ది రోజుల క్రితం ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 2004 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఓంకార్ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకొని చేయి చేయి కలిసి రూ.55 వేలు జమ చేశారు. ఆదివారం సాయంత్రం స్నేహితులు అయ్యకొండలోని ఓంకార్ ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.55వేల నగదును అందజేశారు. పూర్వ విద్యార్థులు రంగస్వామి నాయుడు, కౌలుట్లయ్య, కిరణ్ కుమార్, పొట్ట మునిస్వామి, అనిల్, రంగస్వామి, ఉట్ల మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి పోటీలు

ఆదోని అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదోని జోనల్ స్థాయి ఇండోర్ ఆటల పోటీలను నవంబర్ 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్లా, కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆటల పోటీలను శ్రీ మల్లికార్జున విద్యాలయ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఇందులో చెస్, రూబిక్ క్యూబ్, డ్రాయింగ్, హెలిక్యుషన్, క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు ముందస్తుగా తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే నవంబర్ 29, 30వ తేదీల్లో ఆదోని జోనల్ స్థాయి అవుట్‌డోర్ క్రీడా పోటీలను కూడా నిర్వహిస్తామని తెలియజేశారు. సమావేశంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్‌సింగ్, శ్రీధర్‌రెడ్డి, రాయచోటి సుబ్బయ్య, సోమశేఖర్‌రెడ్డి, పద్మనాభయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి కుట్ర



సంతకాల సేకరణ చేపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి, నాయకులు

కోసిగి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే.. వాటిని కూటమి ప్రభుత్వం బినామీలకు అప్పగించి ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోసిగిలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాలతో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ మైదానంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలనే కూటమి ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పూర్తి చేస్తే పేద విద్యార్థులకు మెడిసిన్ చేసేలా అనువుగా ఉంటుదన్నారు. ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులు మెడిసిన్ చదువులు కలగానే మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రజలు దృష్టికి తీసుకెళ్లి కోటి సంతకాలు చేసి కూటమి సర్కారు గుణపాఠం చెబుదామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, గానిగ వీరస్వామి, బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ నాగరాజు, బండ్ల గోవిందు, జగదీష్ స్వామి, దివ్యాంగుల సంఘం నాయకుడు తాయన్న, అంజనేయులు కొరివి నాగరాజు,దొడ్డి నరసన్న, కాల్వ లక్ష్మయ్య, ఆకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త నజీర్ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని మైనారిటీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, గాయకుడు నజీర్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, వార్డు ఇంచార్జ్ రామాంజిని రెడ్డి, నదికైరవాడి చాంద్‌బాష ,వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టారేణుక ఆదేశాల మేరకు పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తినాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు ముల్లా రసూల్, పట్టణ ఉపాధ్యక్షులు బజారిరెడ్డి, గురువయ్య మాబ్బాష, అల్తాఫ్, ఫయాజ్ తదితరులు నివాళులర్పించారు.



ఆదివారం గుంతను పూడ్చిన ఇసుక ముఠా

మమ్మల్ని ఆపేదెవరు?

- రెవెన్యూ అధికారులకు సవాలుగా మారిన ఇసుక మాఫియా
- తహసీల్దార్ తవ్విన గోతిని పూడ్చిన వైనం
- మళ్లీ ఇసుక అక్రమ రవాణ కొనసాగిస్తున్న వైనం



మొన్న తహసీల్దార్ దగ్గరుండి రహదారికి అడ్డుగా తవ్విస్తున్న గొయ్యి

మంత్రాలయం : ఇక్కడి రెవెన్యూ అధికారులకు ఇసుక మాఫియా సవాలు విసురుతోంది. సాక్షాత్తు తహసీల్దార్ తవ్విన గొయ్యిలను పూడ్చివేసి తమ దర్జాను ప్రదర్శిస్తోంది. తుంగభద్ర నదిలో ఇసుక తమ సొంతమన్నట్టుగా నడుచుకుంటుతోంది. మంత్రాలయం మండల కేంద్రంలో ఇసుక ముఠా ఆగడాలకు అదుపులేకుండా పోయింది. ముఠా ఆగడాలను ఎండగడుతూ ఇటీవల సాక్షిలో 'ఇసుక తోడేళ్లు' అనే శీర్షికన కథనం ప్రచురించడం జరిగింది. అందుకు స్పందిన స్థానిక తహసీల్దార్ రమాదేవి జేసీబీని తీసుకెళ్లి నదిలో ట్రాక్టర్లు వెళ్లకుండా దారిలో అడ్డుగా గోతులు తవ్వించారు. అయితే ఆదివారం సెలవును చూసుకుని ఇసుక మాఫియా మళ్లీ తమ దందాకు తెరతీశాయి. ఓ మేజిస్ట్రేట్ తవ్విన గొయ్యిని అనుమతుల్లేకుండా పూడ్చేసి మరీ తమ దర్జాను ప్రదర్శించాయి. ఆ రోజు ఐదు ట్రాక్టర్లు పట్టుకుని రూ.25 వేలు జరిమానా విధించినా ముఠాలో మార్పులేదు. తమకు రాజకీయ అండదండలు ఉంటే తమను ఆపేదెవరు అన్నంతగా రెచ్చిపోతోంది. ఇసుక ముఠా దర్జాను చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. వీరి ఆగడాలను అడ్డుకునేదెవరు అంటూ విస్తుపోతున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రంతా ఇదే పనిగా ఇసుక అక్రమ రవాణా సాగించడం గమనార్హం. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే ఇక చట్టానికి కళ్లు లేనట్టేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. గొయ్యిని పూడ్చిన ముఠాపై కేసులు నమోదు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆవుల ఉసేనిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

కోసిగి : మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన ఆవుల ఉసేని అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం కోసిగి వెళ్లి వస్తానని చెప్పి ఆవుల ఉసేని ఇంటి నుంచి బయలు దేరాడు. అయితే కోసిగి సమీపంలో దుద్ది రిజర్వాయర్ వద్ద పురుగుల మందు తాగాడు. అనంతరం ప్రాణభయంతో ఇంట్లో వారికి ఫోన్ చేసి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన దుద్ది రిజర్వాయర్ వద్దకు చేరుకొని అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ అంబులెన్స్‌లో ఆదోని హాస్పిటల్‌కు తరలించారు. మందు తాగడానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఆటో డ్రైవర్ల శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు



రోడ్డును చదును చేసుకుంటున్న దృశ్యం

కౌతాళం: ప్రజాప్రనిదులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నపించుకున్నా స్పందన లేకపోవడంతో చేసేది ఏమిలేక ఆటో యూనియన్ నాయకులు, రైతు సంఘం ఆధ్వర్యంలో శ్రమదానం చేసి రోడ్డును చదును చేసుకున్నారు. మండల పరిధిలోని బదినేహాల్ నుంచి జీ హోసళ్లి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని నడవడానికి వీలు లేకుండా తయ్యారయ్యిందని, ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎన్నోసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆదివారం ఆటో వర్కర్స్ యూనియన్, రైతు సంఘం ఆధ్వర్యంలో రోడ్డును జేసీబీతో చదును చేసి, శ్రమదానం చేసి రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్లను తొలగించుకున్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికులు, రైతుల దృష్ట్యా ఈ పనిని చేశామన్నారు. ఆటోలు, టెంపో వాహనాలు బదినేహాల్ నుంచి ఎరిగేరి మీదుగా ఆదోని పోవాలంటే చార్జీలు పెంచాల్సి వస్తుందని, అంతేకాక రైతులు అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని కోలుకోని స్థితిలో ఉన్నారన్నారు. ఇకనైన అధికారులు, కూటమి నాయకులు స్పందించి కొత్త రోడ్డు వేయాలని లేదా కనీసం మరమ్మతులు అయిన చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బడ్డిఖాసీం, టెంపుహుసేని, శేషు, పరుశురాం, నారాయణ, పక్కిర, విజయ్, సుధాకర్, రమేష్ శివ, వీరేష్ పలువురు పాల్గొన్నారు.